# సాక్షి కాకినాడ

గురువారం । 16 । అక్టోబర్ । 2025





**ఆహారం.. ఆరోగ్యం**

మనిషి జీవితంలో ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. కేవలం ఆకలి తీరడానికి మాత్రమే కాదు.. ఆరోగ్యం పెరగడానికి, శక్తి రావడానికి, తద్వారా సమాజ ప్రగతికి కీలకం.

10 లో



**దేదీప్యం.. బ్రహ్మోత్సవం**

వాడపల్లి క్షేత్రంలోని స్వామి వారి వార్షిక దివ్య బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామివారు శ్రీకృష్ణుని అలంకరణలో సూర్యప్రభ, మోహినీ అలంకరణలో చంద్రప్రభ వాహనాలపై విహరించారు.

**సముద్రంలోకి 2.38 లక్షల క్యూసెక్కులు**



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి 2,38,918 క్యూసెక్కుల మిగులు జలాలను బుధవారం సముద్రంలోకి వదిలారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.55 అడుగులు, భద్రాచలం వద్ద 19.70 అడుగులకు నీటి మట్టం చేరింది.

## న్యూస్‌రీల్

### నగరపాలక సంస్థ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా రాహుల్ మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న మీనాను రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్ఎంసీ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొలుత కార్యాలయ ఆవరణలోని శ్రీ అభయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. పురవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యలుంటే తనను సంప్రదించాలని కోరారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడించారు. సాంకేతికత సాయంతో గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. కలెక్టర్ కీర్తి చేకూరిని, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

### పంచారామాలకు ప్రత్యేక బస్సులు

తుని: కార్తికమాసం సందర్భంగా తుని డిపో నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు స్థానిక డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. బుధవారం ఆ మేరకు స్థానిక డిపోలో కరపత్రాలను విడుదల చేశారు. డిపో మేనేజర్ రమణ మాట్లాడుతూ ఈ నెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో (ఆదివారాలు) బస్సు తునిలో బయలుదేరి దర్శనానంతరం సోమవారం సాయంత్రం తిరిగి తుని చేరుతుందన్నారు. ఈ బస్సు టికెట్టు ధర రూ.1250 నిర్ణయించామన్నారు. వివరాలకు 73829 13216, 90633 66433, 73829 13016 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

### ఐఫోన్ కొనుగోలులో రూ.1.04 లక్షల మోసం

రాజమహేంద్రవరం రూరల్: ఓఎల్ఎక్స్‌లో పెట్టిన ఐఫోన్‌ను కొనుగోలు చేద్దామనుకుంటే గుర్తు తెలియని వ్యక్తి తనను సంప్రదించి నగదు వేస్తే ఐఫోన్ అందజేస్తానని చెబితే అతని బ్యాంకు ఖాతాకు రూ.1.04 లక్షలు వేస్తే తనను మోసం చేసాడని మోరంపూడి సాయినగర్‌కు చెందిన పసగడుగుల రాజా శ్రీవెంకట సాయి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం మోరంపూడి సాయినగర్‌కు చెందిన సాయి ఓఎల్ఎక్స్‌లో ఐఫోన్ ఎం ప్రో మోడల్‌ను కొనుగోలు చేయడానికి గుర్తు తెలియని వ్యక్తికి గత నెల 26వ తేదీన బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాకు రూ.1.04 లక్షలు పంపాడు. కానీ సదరు వ్యక్తి ఐఫోన్‌ను అందించకుండా సాయి ఫోన్‌నెంబర్‌ను బ్లాక్ చేశాడు. సదరు వ్యక్తిపై వెంటనే సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయడంతో ఆ మొత్తంలో రూ.1,03,970ను హోల్డ్‌లో పెట్టినట్లు సాయి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### రాష్ట్రంలో నాలుగు స్పోర్ట్స్ అకాడమీలు

దేవరపల్లి: రాష్ట్రంలో నాలుగు స్పోర్ట్స్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. తిరుపతి, నెల్లూరు, కాకినాడ, విశాఖలలో అకాడమీల ఏర్పాటుకు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అధ్యక్షతన ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానించినట్టు ఆయన చెప్పారు. ఈ ఏడాది తొలి విడతలో దేవరపల్లి, కొండెపి, కుప్పం, పాయకరావుపేటలో క్రీడా వికాస కేంద్రాలు నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. కొవ్వూరులో రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలు, దేవరపల్లిలో అండర్-17 సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. దేవరపల్లి మండలంలో దేవరపల్లి, దుద్దుకూరు, యర్నగూడెం, చిన్నాయగూడెం, యాదవోలు గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉన్నందున వాటి అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

### వైభవంగా పవిత్రోత్సవాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి సన్నిధిలో మూడు రోజులు జరిగే పవిత్రోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారిలో విశేషమైన తేజస్సు కోసం నిర్వహించే ఈ పవిత్రోత్సవాలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. విష్వక్సేనారాధనతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.

# మనసు లేని మాటలేల!

- ప్రభుత్వ తీరుపై సర్వత్రా విస్మయం
- పది మంది ప్రాణాలు పోయినా పరిహారానికి మీనమేషాలు
- ఎదురుతెన్నులు చూస్తున్న బాధిత కుటుంబాలు
- సర్కార్‌కు ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు
- జగన్ హయాంలో 24 గంటల్లోనే సాయం



రాయవరం మండలం సోమేశ్వరంలో విజయలక్ష్మిని కోల్పోయి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సాక్షి, ప్రతినిధి, కాకినాడ: కూటమి ప్రభుత్వానికి మానవత్వం బొత్తిగా లేకుండా పోతోంది. ప్రజలకు కష్టం వస్తే ఆదుకోవలసిన బాధ్యత లేదా అనేలా వ్యవహరిస్తోంది. తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో సంభవించిన బాణసంచా విస్ఫోటంలో ప్రాణాలు కోల్పోయిన పది మందిలో బాణసంచా తయారీ దుకాణం యజమాని తప్ప మిగిలిన వారంతా రెక్కాడితే కానీ డొక్కాడని వారే. ఈ పెను విషాదం జరిగి వారం రోజులు గడిచినా మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి నాలుగు మాటలు చెప్పి వెళ్లడమే తప్ప తక్షణ సాయం అందించే దిశగా ఎటువంటి చర్యలు లేవు. రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో ఎప్పుడో ఓ టీడీపీ కార్యకర్త హత్యకు గురైతే ఆ కుటుంబంలో ఒకరికి ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది. అదే ఉదారత రాయవరం ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారిపై లేకపోవడం ఏంటని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని బుధవారం రాయవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాలు ధర్నాకు దిగి అధికారులను నిలదీశాయి.

ఈ దుర్ఘటనలో బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన బాణసంచా యూనిట్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) మినహాయిస్తే మిగిలిన వారంతా పొట్టకూటి కోసం బాణసంచా తయారీకి వచ్చిన వారే. కొమరిపాలేనికి చెందిన పొట్నూరి వెంకటరమణ, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ, వాసంశెట్టి విజయలక్ష్మి, అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, చిట్టూరి యామిని, అనపర్తి సావరానికి చెందిన కుడుపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, కొమరిపాలెం, పెదపూడి మండలం వేండ్రకు చెందిన లింగం వెంకటకృష్ణ, ఒడిశాకు చెందిన కె. సదానందం మృతులు. యజమాని మినహా మిగిలిన వారంతా ఎస్సీ, బీసీ సామాజికవర్గాల వారే. తమ ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు అగ్రాసనం వేస్తుందని గొప్పగా చెప్పుకొనే సర్కార్ కనీసం వారిని ఆదుకోవాలని ఆలోచించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఘటన జరిగిన రోజు రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి వెళ్తున్నారు తప్ప ఎటువంటి సాయం ప్రకటించకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అలా కాదని సాయం కోసం ప్రశ్నిస్తే ఇచ్చే సాయం ఇవ్వరేమోననే భయం వారిని మాట్లాడనీయలేదు. వారిని పక్కనబెడితే కూటమి నేతలైన మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబాలను పలకరించి ప్రభుత్వ పరంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారే తప్ప ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని ఎక్కడా ప్రస్తావించకపోవడం విస్మయానికి గురిచేసింది.

### సత్వరం పరిహారం అందించాలి



రాయవరం బాణసంచా ప్రమాద మృతులకు సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ప్రమాదం జరిగి అప్పుడే వారం రోజులు గడచిపోయాయి. ఇప్పటి వరకు బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించక పోవడం విచారకరం. బాధిత కుటుంబాలు కూడా ఆందోళనలో ఉన్నారు. తక్షణం బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్

అసలు సంఘటన జరిగిన రోజు వచ్చిన సందర్భంలోనే మంత్రులు ప్రభుత్వ సాయాన్ని ప్రకటించాల్సి ఉంది. అలా కాకుండా ఈ ఘటనపై సమీక్షించిన తరువాత అయినా ఆర్థిక సాయాన్ని ప్రకటించాల్సి ఉంది. కాగా బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాత్రం జ్యుడీషియల్, ప్రభుత్వం వైపు నుంచి విచారణ జరుగుతోంది, పరిహారం ఎలా ఇవ్వాలనేది ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కాలయాపనపై ప్రజా సంఘాలు కార్మిక న్యాయస్థానానికి వెళ్లేందుకు సిద్ధపడుతున్నాయి.

కాగా, ఈ దుర్ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తనంతట తానుగా మంగళవారం కేసు నమోదుచేస్తున్నట్టు ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనకు కారణాలను ఎన్‌హెచ్ఆర్సీ ప్రశ్నించింది. మీడియా కథనాల ఆధారంగా కేసు నమోదుచేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. బాధితుల సమీప బంధువులకు పరిహారం అందించారా అనే విషయాన్ని కూడా రెండు వారాల్లో అందించే నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యంత విషాదకర ఘటనగా నిలిచిపోయిన వాకతిప్ప బాణసంచా పేలుడు 2014 అక్టోబర్ 10వ తేదీన జరిగింది. ఆ దుర్ఘటనలో 18 మంది మృతి చెందారు. నాడు ప్రతిపక్ష నేతగా జగన్ ఒకో కుటుంబానికి రూ.50 వేలు సొంత నిధులు అందించి ఆదుకున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ తొలుత లక్షన్నర పరిహారం ప్రకటించింది. జగన్ వచ్చి వెళ్లాక ఆర్థిక సాయాన్ని రూ.3 లక్షలు చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రభుత్వం మానవత్వంతో ఆదుకున్న ఉదంతాలు కోకొల్లలు. సామర్లకోట మండలం జి. మేడపాడులో 2019 అక్టోబర్‌లో బాణసంచా తయారు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో మృతుల కుటుంబాలకు జగన్ ప్రభుత్వం సుమారు రూ.15 లక్షలు సాయం అందించింది. రంపచోడవరం మన్యం ప్రాంతంలో కచ్చులూరు వద్ద 2019లో పాపికొండలకు వెళ్లే పర్యాటక బోటు బోల్తా పడిన సంఘటనలో 48 మంది మృత్యు వాతపడ్డారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున సాయం అందించింది. అలాగే తాళ్లరేవు మండలం జి.వేమవరంలో బాణసంచా పేలుడు ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. వెంటనే కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారాన్ని, క్షతగాత్రులకు రూ.3 లక్షలు అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు ప్రకటించారు.

### పట్టాలు ఇచ్చారు.. భూమి చూపలేదు



బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగి ఏళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు ఇచ్చిన పట్టాలకు నేటికీ భూమిని చూపించలేదు. అక్టోబర్ పదో తేదీ 2014లో వాకతిప్పలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి 18 మంది అక్కడకక్కడే మృతి చెందారు. వారిలో నా భార్య మసకపల్లి పుష్పావతి, మరదలు మసకపల్లి కుమారి ఉన్నారు. అప్పట్లో బాధిత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం ఒక్కొక్కరికి 50 సెంట్లు భూమి ఇస్తానని బి పట్టాలు ఇచ్చింది. ఆ భూమి చూపించాలని తహసీల్దార్ కార్యాలయం, స్పందనకు కాళ్లు అరిగేలా తిరుగుతూ వచ్చాం. ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఈ పట్టాలకు సంబంధించిన భూమిని గతంలో వేరే వారికి ఇచ్చారు. వారి దగ్గర పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయి. మమ్మల్ని అప్పటి ప్రభుత్వం మోసం చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఇస్తానన్న 50 సెంట్ల భూమిని ఇవ్వాలి.

– మసకపల్లి నాగేశ్వరరావు, వాగతిప్ప

### ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబాన్ని ఆదుకోవాలి



ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలి. రాయవరంలో ఈ నెల 8న సంభవించిన బాణసంచా తయారీ కేంద్రంలో తమ కుమారుడు లింగం వెంకటకృష్ణ (22) చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 12న చనిపోయాడు. ప్రభుత్వం తమ కుటుంబానికి పరిహారం ప్రకటించి ఆదుకోవాలి. చేతికి అందివచ్చిన కొడుకు కళ్లముందు చనిపోతుంటే ఆ పరిస్థితిని చూసి తట్టుకోలేపోతున్నాం.

– లింగం రాము, మృతుడు తండ్రి, వేండ్ర, పెదపూడి మండలం

### ప్రభుత్వం ఆదుకోవాలి



నా తల్లి విజయలక్ష్మిని కోల్పోయాను. ఇంత కాలం మా కుటుంబాన్ని నెట్టుకుంటూ వచ్చింది. ఈ ప్రమాదంతో దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాం. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకుంటుందని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– దుర్గాదేవి, సోమేశ్వరం, రాయవరం

# రత్నగిరిపై ముగిసిన సంప్రోక్షణ

- ఘనంగా శాంతి హోమం, పూర్ణాహుతి
- సాక్షి కథనంపై స్పందన



శాంతిహోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులు, సిబ్బంది, ప్రకృతి ద్వారా సంభవించే అపశృతులు, అపచారాల వల్ల ఎదురయ్యే దుష్ఫలితాలను పారదోలి భక్తి, ఆధ్యాత్మిక వాతావరణ పునరుద్ధరణకు చేపట్టిన సంప్రోక్షణ పూజలు బుధవారంతో ముగిశాయి. దేవస్థానం విశ్రాంత వేద పండితుడు, వైదిక సలహాదారు, త్రివేది బ్రహ్మశ్రీ కపిలవాయి రామశాస్త్రి సూచనలతో నిర్వహిస్తున్న శాంతి హోమం పూర్ణాహుతితో ముగిసింది.

ఆలయంలోని దర్బారు మండపంలో పూజలు ముగిసిన అనంతరం పండితులు మంత్ర జలాలను స్వామి, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారు, శంకరులపై సంప్రోక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణం నలుమూలలా, యంత్రాలయం, రామాలయం, వ్రతమండపాలు, నిత్య కల్యాణమండపం, మెట్లదారి, ఘాట్‌రోడ్, వివిధ సత్రాలలో మంత్ర జలాన్ని చల్లి శుద్ధి చేశారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు, కపిలవాయి రామశాస్త్రి సోమయాజి, వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, గంగాధరభట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు దత్తాత్రేయ శర్మ,సుధీర్, కంచిబట్ల సాయిరామ్, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, ఇతర వైదిక బృందం నిర్వహించారు.

**'సాక్షి' కథనంతో..**

దేవస్థానంలో చాలా కాలంగా సంప్రోక్షణ పూజలు కాని, ప్రత్యేక యాగాలు, కోటి తులసి పూజలు జరగకపోవడంతో మూడు నెలలుగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పండితులు, అర్చక స్వాములు అభిప్రాయపడ్డారు. దీనిపై ఏడో తేదీన సాక్షి దినపత్రికలో ' అపశృతులు అందుకేనా...?' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు శాంతి పూజలు నిర్వహించాలని పండితులను ఆదేశించారు. దాంతో ఆలయ వైదిక సలహాదారు రామశాస్త్రి సోమయాజి సూచనలతో సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహించారు.

### ఏటా సంప్రోక్షణ, శాంతి హోమం తప్పనిసరి



అన్నవరం దేవస్థానంలో తెలిసో తెలియకో జరిగే అపచారాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను ఎదుర్కొనేందుకు ఏటా సంప్రోక్షణ పూజలు, శాంతి హోమం నిర్వహించి ఆలయాన్ని శుద్ధి చేయాలి. ప్రకృతి ప్రకోపం వలన ఏర్పడే తుఫాన్లు, సునామీ, కరోనా తదితర సమయాలలో ఎదురయ్యే దుష్పరిణామాలు ఈ వైదిక కార్యక్రమాల వల్ల సమసిపోతాయి.

– బ్రహ్మశ్రీ కపిలవాయి రామశాస్త్రి సోమయాజి, త్రివేది, దేవస్థానం విశ్రాంత వేదపండితుడు, వైదిక సలహాదారు

### భీమేశ్వరస్వామికి రూ.26.37 లక్షల ఆదాయం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.26,36,734 వచ్చినట్లు ఆలయ ఈఓ, దేవదాయశాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. ఈ ఏడాది జూలై 5 నుంచి అక్టోబర్ 15 వరకు 102 రోజులకు హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించామన్నారు. హుండీల్లో రూ.24,72,056, అన్నదానం హుండీల్లో రూ.1,64,675, 2.200 గ్రాముల బంగారం, 99 గ్రాములు వెండి వచ్చిందన్నారు. దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రామచంద్రపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాం ప్రసాద్, కె.గంగవరం గ్రూపు టెంపుల్స్ ఈఓ వి.బాలకృష్ణ, వెల్ల గ్రూపు టెంపుల్స్ ఈఓ వైవీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు, వైదిక సిబ్బంది, స్థానిక పెద్దలు పెంకే సాంబశివరావు, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ నవీన్ పాల్గొన్నారు.

# 'సాక్షి'పై కేసుల కుట్రలు

- ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై దాడే
- జర్నలిస్టు సంఘాల నిరసన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పత్రికల గొంతునొక్కి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయాలని కూటమి సర్కార్ చేస్తున్న కుట్రలపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. రాష్ట్రంలో 'సాక్షి' పత్రికపైన, పత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయరెడ్డి, పత్రికలో పని చేస్తున్న జర్నలిస్టులను అక్రమ కేసులతో వేధించడాన్ని ప్రజాస్వామ్యవాదులు ఖండిస్తున్నారు. హైదరాబాద్, విజయవాడలోని సాక్షి కార్యాలయాల వద్ద పోలీసులు మోహరించి సిబ్బందిని భయాందోళనకు గురిచేయడంపై నిరసన వ్యక్తమవుతోంది. సాక్షి కార్యాలయానికి నేరుగా వచ్చిన పోలీసులు విధులకు ఆటంకం కలిగించడం సహేతుకం కాదంటున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే 'సాక్షి'పై కక్ష కట్టి అక్రమ కేసులు పెట్టడం అన్యాయమంటున్నారు. కూటమి సర్కార్ ఒక పక్క సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతుంటే అధికార కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు మరో అడుగు ముందుకేసి రాజానగరం సాక్షి కార్యాలయాన్నే లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డ సంఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. ఇది ఇప్పటికిప్పుడు కాకుండా గడచిన ఏడాదిన్నర కాలంగా జరుగుతోంది. గత జూన్ 10న పచ్చ మూకలు పేట్రేగిపోయాయి. తేదేపా శ్రేణులు ఏకంగా రాజానగరం సాక్షి కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలోనే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయారు. సాక్షి ప్రింటింగ్ కార్యాలయంలోకి చొరబడేందుకు సైతం ప్రయత్నించి రాళ్లు కూడా రువ్వారు. డివిజన్ స్థాయి పోలీసు అధికారుల సమక్షంలోనే కూటమి నేతలు దాడులకు తెగబడి సాక్షి చిరునామా బోర్డును ధ్వంసం చేశారు. వీటికి కొనసాగింపుగా కూటమి సర్కార్ పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు సహా పలు జిల్లాల్లో సాక్షి జర్నలిస్టులపై అక్రమ కేసులతో వేధిస్తుండడంపై జర్నలిస్టు సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

### 'ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు'



పత్రికలు, వాటిలో పనిచేసే జర్నలిస్టుల పట్ల ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు దిగడం అన్యాయం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయ్యినా ఇప్పటికీ బ్రిటీష్ పాలన మాదిరిగా పత్రికలపై దాడులకు దిగడం నీతి బాహ్యమైన చర్యే. విజయవాడ, హైదరాబాద్ సాక్షి కార్యాలయంలోకి పోలీసులు వెళ్లడం ద్వారా పత్రిక రోజువారీ దినచర్యలకు ఆటంకం కలిగించడం సహేతుకం కాదు. పత్రికల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టే...

– రెడ్డిపల్లి రాజేష్, అధ్యక్షుడు, సిటీ ప్రెస్‌క్లబ్,కాకినాడ

### రాజకీయ కక్షలు, కార్పణ్యాలతోనే




రాజకీయ కక్షలు కార్పణ్యాలతో 'సాక్షి' మీడియా సంస్థపై దాడికి దిగడం సరైన విధానం కాదు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామనే విషయాన్ని మరిచిపోకూడదు. అదికూడా సమయం సందర్భం లేకుండా తరచు సాక్షి కార్యాలయంపై పోలీసుల దాడి, కార్యాలయంలో పోలీసుల హల్‌చల్, సంపాదకుడు ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించడమే. ప్రజాస్వామ్యవాదులు ఈ దాడులను తీవ్రంగా ఖండించాల్సిందే.


– నదీముల్లాఖాన్ దురాని, మాజీ ఉపాధ్యక్షుడు ఏపీడబ్ల్యూజే, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా

# రా'బంధువుల' మధ్య జీవించలేనంటూ..

- ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య
- ముగ్గురి వేధింపులే కారణమని సెల్ఫీ
- ఆలమూరు మండలం మడికిలో విషాదం



మడికి శివారు చిలకలపాడులో మృతుల నివాసం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

ఆలమూరు: బంధువులే రాబంధువులు అయ్యారు. అయిన వాళ్లే గద్దల్లా అనునిత్యం పొడుచుకుతిన్నారు. కేసులు పెట్టి హింసించి జైలుకు పంపించారు. సూటిపోటి మాటలతో వ్యక్తిత్వాన్ని కించపరచేవారు. దీంతో సమాజంలో తాను బతకలేనని అతడు భావించాడు. తాను చనిపోతే బిడ్డలు అనాథలైపోతారని భావించి, ముక్కుపచ్చలారని వారికి పురుగు మందు పట్టించి హత్య చేశాడు. తాను కూడా ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ హృదయ విదార సంఘటన ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం తెల్లవారుజామున జరిగింది.

**వివరాలు ఇవీ..**

స్థానిక శ్రీషిర్డీసాయి ఆలయం సమీపంలో నివసిస్తున్న పావులూరి కామరాజు అలియాస్ చంటి (36) గతంలో గ్రామ వలంటీర్‌గా పనిచేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో, తన కులవృత్తి అయిన సెలూన్ షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఐదేళ్ల క్రితం చంటి భార్య నాగదేవి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి చంటే కారణమంటూ అత్తింటి వైపు బంధువులు ఆగ్రహంతో ఉన్నారు. ఆ సమయంలో ఆలమూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో చంటి జైలు శిక్షకు గురయ్యాడు. ఇటీవల భార్య నాగదేవి ఆత్మహత్య కేసుపై రాజీ కుదరడంతో బయటపడ్డాడు. కానీ బిడ్డలను చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.

**క్లూస్ టీం రాక**

బిడ్డలను చంపి తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టేందుకు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై జి.నరేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కాకినాడ నుంచి క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. మృతుడు చంటి సెల్ఫీ వీడియోలోని ఆరోపించిన విధంగా ఆ ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వీటి వెనుక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**కుటుంబ సభ్యుల రోదన**

గ్రామస్తులకు చేదోడు వాదోడుగా ఉంటూ అందరిని అప్యాయంగా పలుకరించే తన కుమారుడు చంటి, బుడిబుడి అడుగులతో అల్లరితో సందడి చేసే ఇద్దరు మనవలు ఒకేసారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. లోకం పోకడ తెలియని ఆ చిన్నారులను చంపి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డావంటూ వారు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది. ముక్కుపచ్చలారని ఆ పసిబాలురు మృతదేహాలను చూసిన స్థానికులు చలించిపోయారు.

### కారణం ఆ ముగ్గురే..

తన సమీప బంధువులైన పావులూరి దుర్గారావు, కొరుప్రోలు తలుపులు, కొరుప్రోలు శ్రీనివాసరావు వేధింపులతోనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చంటి ఆరోపించాడు. చనిపోయే ముందు ఒక సెల్ఫీ వీడియోను రూపొందించి తన కుటుంబ సభ్యులకు పంపించాడు. ఇటీవల ఆ ముగ్గురూ తనను చంపేందుకు పలు రకాలుగా ప్రయత్నించారన్నారు. తాను చనిపోతే తన కుమారులు అనాథలై పోతారని ఆందోళన చెందాడు. తన మాదిరిగా బిడ్డల ఆలన పాలన ఎవ్వరూ పట్టించుకోరని ఆవేదన చెందాడు. ఆ ఉద్దేశంతోనే పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వివరించాడు. ఆ ముగ్గురినీ కఠినంగా శిక్షించి తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు.

## అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్త కొబ్బరి (క్వింటాల్) | 20,000 – 22,500 |
| కొత్త కొబ్బరి (రెండో రకం) | 10,500 – 12,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 30,000 |
| గటగట (వెయ్యి) | 28,000 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 29,000 |
| గటగట (వెయ్యి) | 27,000 |
| నీటికాయ | |
| పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 23,000 – 25,000 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 23,000 – 25,000 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 5,250 |
| కిలో | 350 |

## క్లుప్తంగా

### మస్కట్ నుంచి సురక్షితంగా స్వదేశానికి..


పిప్పర శ్రీలత (ఫైల్)

అమలాపురం రూరల్: నకిలీ ఏజెంట్ కారణంగా మస్కట్‌లో చిక్కుకుపోయిన ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన పిప్పర శ్రీలతను కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు స్వదేశానికి సురక్షితంగా తీసుకువచ్చారు. శ్రీలత గత జూన్‌లో మస్కట్ వెళ్లింది. అక్కడ సరైన పని దొరక్కపోవడం, యజమాని వేధింపులు, మూడు ఇళ్లలో పనికి చేరినా లాభం లేక తీవ్ర ఇబ్బందులు పడింది. వీటికి తోడు అనారోగ్య సమస్యలతో భారత రాయబార కార్యాలయానికి వచ్చేసింది. ఆమె సమాచారం మేరకు తండ్రి మల్లవరపు వెంకటేశ్వర్లు.. కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను ఆశ్రయించారు. తన కుమార్తెను స్వదేశానికి సురక్షితంగా తీసుకురావాలని కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందం అక్కడి భారత రాయబారి ఇంటి రాజ్యలక్ష్మితో సంప్రదింపులు జరిపి, భారత విదేశీ రాయభార మంత్రిత్వ శాఖ సహకారంతో స్వదేశానికి సురక్షితంగా చేర్చినట్టు నోడల్ అధికారి, డీఆర్‌ఓ కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ల రమేష్ బుధవారం తెలిపారు.



# ఆహారం.. ఆరోగ్యం

- సమాజ ప్రగతికి మూలం
- ఆహార ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లా కీలకం
- వ్యవసాయం, పౌల్ట్రీ, ఆక్వా రంగాల్లో ముందంజ
- దేశ, విదేశాలకు ఎగుమతులు
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

కపిలేశ్వరపురం: మనిషి జీవితంలో ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. కేవలం ఆకలి తీరడానికి మాత్రమే కాదు.. ఆరోగ్యం పెరగడానికి, శక్తి రావడానికి, తద్వారా సమాజ ప్రగతికి ఎంతో కీలకం. ఆహార ఉత్పత్తిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఎంతో ప్రాధాన్యం ఉంది. వ్యవసాయ ప్రాధాన్యమైన ఈ జిల్లాలో పౌల్ట్రీ, ఆక్వా రంగాలు కూడా ఊపందుకున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆహార ఉత్పత్తి రంగాలకు చేయూత లభించింది. ప్రస్తుత కూటమి పాలనలో ప్రధాన ఆహార ఉత్పత్తి రంగమైన వరి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం (అక్టోబర్ 16 ) ప్రపంచ ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**ప్రపంచ ఆహార దినోత్సవ ప్రాధాన్యం**

1945 అక్టోబర్ 16న యునైటెడ్ నేషన్స్‌కు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అసోసియేషన్ (ఎఫ్ఏవో) అనే సంస్థ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ రోజును ప్రపంచ ఆహార దినంగా జరుపుకొంటున్నారు. ఆహారానికి సంబంధించిన వ్యవసాయం, ఆక్వా, పాడి పరిశ్రమ తదితర రంగాల్లో కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ప్రగతిపై ఎఫ్ఏవో సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.


మండపేటలో ఆహార తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి (ఫైల్)

**ఉమ్మడి జిల్లా ప్రత్యేకతలు**

- ఆహార ఉత్పత్తిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చాలా కీలకంగా మారింది. దీనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.54 లక్షల ఎకరాల వరి సాగు నుంచి 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి లభిస్తోంది. కాకినాడ జిల్లాలో 2.14 లక్షల ఎకరాల నుంచి 5 లక్షల టన్నులు, తూర్పుగోదావరి జిల్లాలో 1.75 లక్షల ఎకరాల నుంచి 5.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది.
- కోనసీమ జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో ఉత్పత్తి అవుతున్న కొబ్బరిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో దాదాపు 2.25 లక్షల టన్నుల కూరగాయలు, ఆకుకూరలు దిగుబడి అవుతున్నాయి.
- ఉమ్మడి జిల్లాలో సుమారు 10 మధ్య, చిన్నతరహా, 40 కుటీర మామిడి తాండ్ర తయారీ పరిశ్రమలు ఉన్నాయి. విస్తారంగా మామిడి సాగు ఉంది. కోనసీమలోని ఆత్రేయపురం, కాకినాడ జిల్లాలోని పండూరు, సర్పవరం, తమ్మవరం, గొల్లప్రోలు, కత్తిపూడి, తొండంగి, జగ్గంపేట, చేబ్రోలు, ధర్మవరం, మల్లిశాలల్లో ఉత్పత్తి విస్తారంగా సాగుతోంది.
- ఉమ్మడి జిల్లాలో 25,58,729 పశువుల పెంపకంతో పాలు, మాంసం ఉత్పత్తి జరుగుతోంది. సుమారు 200 పౌల్ట్రీల్లో 1.40 కోట్ల కోళ్లను పెంచుతున్నారు. వీటి ద్వారా మాంసం, గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి.
- 60 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా 190 హేచరీలు ద్వారా ఏడాదికి 20 వేల మిలియన్ల సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు. ఏటా 1.35 లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతి జరుగుతోంది. అత్యధికంగా కోనసీమ జిల్లాలో 36,736 ఎకరాల్లో ఆక్వాసాగు చేస్తున్నారు.

### వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

సామాన్యులకు ఆహారాన్ని అందించే ప్రధాన వ్యవస్థల్లో రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ముఖ్యమైనవి. ఈ రెండు వ్యవస్థలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా నడిపించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతోనూ ఏజెన్సీ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పేరుతో సబ్‌ప్లాన్ ప్రాంతాల్లోనూ మొత్తం 3,28,466 మందికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఎండీయూ వాహనాలతో రేషన్ సరకులను ఇంటి వద్దకే అందజేశారు. 2020 మే 30న రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం కాగా జిల్లాలో 1,129 రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి వాటిలో 865 కియోస్క్ యంత్రాలను సమకూర్చి ఆహార ఉత్పత్తిని ప్రోత్సహించారు. పాడి పరిశ్రమ రంగానికి జీవం కల్పించే దిశగా ఆర్‌బీకే కేంద్రాలకు అనుసంధానంగా రాష్ట్రంలో 6,500 మిల్క్ కలెక్షన్, 6,500 బల్క్ మిల్క్ సెంటర్లను నెలకొల్పారు.

### కూటమి పాలనలో అస్తవ్యస్తం

రాష్ట్రంలో పేదలు రేషన్ షాపుల్లో ఇచ్చే సరకులపై ఆధారపడతారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫిబ్రవరి నుంచి దాదాపు తొమ్మిది నెలలుగా కంది పప్పు సరఫరా చేయడం లేదు. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. దీని వల్ల పేదలు అవస్థలు పడుతున్నారు. జీఎస్టీ 2.0 నూతన శ్లాబుల విధానం క్షేత్ర స్థాయిలో అమలు కాకపోవడంతో నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

### తూతూమంత్రంగా తనిఖీలు

ఆహార భద్రతా విభాగంలో తగినంతమంది సిబ్బంది లేకపోవడంతో క్షేత్ర స్థాయిలోని హోటళ్లు, ఇతర ఆహారం తయారీ, విక్రయ కేంద్రాలను తనిఖీ చేయడంలో లోపాలు తలెత్తుతున్నాయి. కోనసీమ జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ 85 తనిఖీలు చేయగా 38 కేసులు నమోదు చేశారు. రూ.3.21 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు.

## స్వచ్ఛమైన తాగునీటిపై దృష్టి సారించాలి


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట: ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మండల స్థాయి అధికారులు దృష్టి సారించాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని మండల పరిషత్తు పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు నిర్వహిస్తున్న ఏడో బ్యాచ్ శిక్షణ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు తాగునీరు రుచిగా ఉన్నప్పటికీ, కొన్నేళ్లకు ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ మేరకు ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలు సమన్వయంతో పని చేసి తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్ఈలు ఉమాశంకర్, శ్రీనివాసు, సురేష్, పెద్దాపురం డీఈఈ స్వామి, ఏఈఈ శ్రీరామ్, ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు, ఎస్ఎస్ వర్మ, డి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

# దేదీప్యం.. బ్రహ్మోత్సవం


వాడపల్లిలో ఉత్సవ మూర్తులను అభిషేకిస్తున్న పండితులు


శ్రీకృష్ణుని అలంకరణలో శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తున్న ఆలయ ఈఓ, చైర్మన్, భక్తులు

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి విహారం
- దర్శనానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట: వాడపల్లి క్షేత్రంలోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం స్వామివారు శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ, మోహినీ అలంకరణలో చంద్రప్రభ వాహనాలపై విహరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వాహన సేవలను వీక్షించారు. దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, పర్యవేక్షణలో ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చక బృందం, వివిధ ప్రాంతాల వేద పండితులు పూజలు నిర్వహించారు. డీసీ అండ్ ఈఓ చక్రధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు పాల్గొన్నారు.

**రెండు వాహనాలపై ఊరేగింపు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రెండు వాహనాలపై స్వామివారు ఊరేగారు. ఉదయం శ్రీకృష్ణుని అవతారంలో సూర్యప్రభ వాహంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయువు లభిస్తాయని పండితులు తెలిపారు. అనంతరం రాత్రి శ్రీవారు మోహినీ అలంకారంతో చంద్రప్రభ వాహనంపై విహరించారు. దీని వల్ల భక్తులకు శాంతి, ఐశ్వర్యం కలుగుతాయని నమ్మకం. ఈ సందర్భంగా నిర్వహించిన మేళతాళాలు, కేరళ వాయిద్యాలు, కోలాటం, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

**నేటి కార్యక్రమాలు**

స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం బ్రహ్మోత్సవాల నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలు జరుగుతాయి. స్వామివారికి రాజాధిరాజ అలంకరణలో గజ వాహనసేవ నిర్వహిస్తారు.

## రూ.72.23 లక్షలకు కొబ్బరి చెక్కల వేలం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో భక్తుల కొట్టిన కొబ్బరి చెక్కలను పోగుచేసుకునే వేలం రూ.72,23,499కు ఖరారైంది. ఈ ఏడాది నవంబర్ 16 నుంచి వచ్చే ఏడాది నవంబర్ 15 వరకూ ఏడాది పాటు కొబ్బరి చెక్కలు తీసుకునేందుకు బుధవారం అమలాపురం ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ ముదునూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ – టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం ద్వారా పాట జరిగింది. తొండంగి మండలం సీతారామపురానికి చెందిన గింజాల నాగ వెంకట సత్తిబాబు రూ.72,23,499కు పాట దక్కించుకున్నాడు.


కొబ్బరి చెక్కలకు వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గతేడాది రూ.45 లక్షలకు వెళ్లి వేలం ఈ సారి మరింత పెరిగిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

## జాతీయ బాక్సింగ్ పోటీలకు నిహారిక


జాతీయ పోటీలకు ఎంపికైన నిహారికతో కోచ్ తదితరులు

రామచంద్రపురం: పట్టణానికి చెందిన కారుమూరి నిహారిక జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కిక్ బాక్సింగ్ మాస్టర్ బీకే రత్నం, కోచ్ అంజనీ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అడ్మిన్ సెక్రటరీ వి.భువనేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏవీడీ ప్రసాద్ ఈ విషయాన్ని ప్రకటించారన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ హైస్కూల్లో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు అండర్ – 14, 17 విభాగంలో 69వ సాప్ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలు జరిగాయన్నారు. వాటిలో సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. రామచంద్రపురానికి చెందిన నిహారిక ఫైనల్ ఫైట్‌లో విశాఖపట్నానికి చెందిన సాయి అకాడమీ క్రీడాకారిణితో తలబడి విజయం సాధించిందన్నారు. తద్వారా ఈ నెల 28న అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైందని తెలిపారు.ఈ సందర్భంగా నిహారికను పలువురు అభినందనలు తెలిపారు.

## ఆహా ఏమి రుచి.. అతిథులు మైమరచి..

- ‘నన్నయ’లో ఆహార మహోత్సవ్ ప్రారంభం
- తొలిరోజు ఆకట్టుకున్న ‘తూర్పు’ రుచులు
- పోటాపోటీగా వంటకాల తయారీ


స్టాళ్లలో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, న్యాయనిర్ణేతలు

రాజానగరం: పిజ్జాలు, బర్గర్లు అంటూ రెడీమేడ్ ఫుడ్‌కు అలవాటు పడిన నేటి కాలంలో అసలైన సంప్రదాయ ఆహార పదార్థాల రుచులను గోదావరి వాసులు తమ వంటల ద్వారా నిరూపిస్తున్నారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఆహార మహోత్సవ్ 2025 బుధవారం ప్రారంభమైంది. గోదావరి జిల్లాల్లోని ఆహారపు అలవాట్లు, వంటకాల గురించి తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

**స్టాళ్ల ఏర్పాటు**

మొదటి రోజు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, తమ సన్నిహితులతో కలిసి సంప్రదాయ, ఆరోగ్యకర ఆహార పదార్థాలను తయారు చేయడంలో పోటీపడ్డారు. తాము తయారు చేసిన పదార్థాలతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. వాటిని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, పలువురు అతిథులు, యూనివర్సిటీ, కళాశాలల ఉద్యోగులు, విద్యార్థులు సందర్శించి రుచులను ఆస్వాదించారు. గురువారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది తమ వంటలతో పోటీపడనున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తారు.


వెజ్ విభాగంలో మొదటి బహుమతి సాధించిన ప్రశాంతిశ్రీ, హేమ ప్రియాంక

**తొలిరోజు విజేతలు**

- శాకాహారం విభాగంలో బి.ప్రశాంతిశ్రీ, పి.హేమ ప్రియాంక ప్రథమ, డాక్టర్ పి.శిరీష బృందం ద్వితీయ, కె.మమత తృతీయ స్థానాల్లో నిలిచారు.
- మాంసాహార వంటలకు సంబంధించి యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్ విద్యార్థులు ప్రథమ, బి.లక్ష్మి ద్వితీయ, వై.బాబీ తృతీయ స్థానం పొందారు.


నాన్ వెజ్ విభాగంలో విజేతలుగా నిలిచిన బాయ్స్ హాస్టల్ విద్యార్థులు

- న్యాయ నిర్ణేతలుగా జిల్లా రోగనిరోధక అధికారి డాక్టర్ కోమలి, కెమిస్ట్రీ అధ్యాపకురాలు బీబీ నళిని, గైనకాలజిస్టు డాక్టర్ చందన పర్వత వర్ధిని, శ్రీలక్ష్మి, ఎస్.పుష్పలత వ్యవహరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, హెచ్‌ఓడీ ఆచార్య డి.కల్యాణి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే రామచంద్ర, అడ్వకేట్ ఎ.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇంటికి చేరిన బాలుడు


నాగ దినేష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కాజులూరు: గొల్లపాలెంలో నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన బాలుడు క్షేమంగా ఇంటికి చేరాడు. తల్లి మందలించడంతో మనస్థాపానికి గురై అతడు ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని చీకట్లవారిపేటకు చెందిన నాగ దినేష్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గత ఆదివారం మధ్యాహ్నం మిత్రులతో ఆడుకుంటానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు తమ బంధువులు, అతడి స్నేహితులందరినీ విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి గోవిందరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా నాగ దినేష్ బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. పాఠశాల పూర్తయిన తర్వాత ఇంటికి రాకుండా స్నేహితులతో తిరుగుతున్నావంటూ తల్లి మందలించడంతో బాలుడు అలిగి వెళ్లిపోయినట్టు పోలీసులు తెలిపారు. విజయవాడకు వెళ్లిపోయిన నాగ దినేష్‌కు ఇంటిపై బెంగరావడంతో ఒక పోలీస్ కానిస్టేబుల్ సహకారంతో తిరిగి ఇంటికి చేరాడు. గొల్లపాలెం ఎస్సై ఎం. మోహన్‌కుమార్ ఆ బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## ముగిసిన ఉషూ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల అండర్–19 బాలురు, బాలికాల ఉషూ పోటీలు బుధవారం ముగిశాయి. తుమ్మలావలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి ఆర్‌ఈఓపీఏ బి.జాన్సన్, రాజమహేంద్రవరం ఎంఈవో బి.దిలీప్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు ప్రసాద రావు, భువనేశ్వరి పాల్గొన్నారు.

## రెండు స్కాన్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు

కాకినాడ క్రైం: కాకినాడ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు స్కాన్ సెంటర్ల అనుమతులు రద్దు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కాకినాడ శ్రీనగర్ జన్మభూమి పార్కు సమీపంలోని యూఎస్ విమెన్ కేర్ ఫెర్టిలిటీ క్లినిక్, జవహర్ వీధిలోని వెంకటేశ్వర స్కాన్ సెంటర్ల రిజిస్ట్రేషన్లను కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేశామన్నారు.

## లైబ్రేరియన్ నాయక్‌కు అంతర్జాతీయ గుర్తింపు

బాలాజీచెరువు (కాకినాడ): స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూకే)లో గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ బీఆర్ దొరస్వామి నాయక్ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆయన ఢిల్లీలోని ఇంటర్నేషనల్ పబ్లికేషన్ హౌస్ నుంచి ప్రచురితమవుతున్న ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ లైబ్రేరియన్షిప్ అండ్ అడ్మినిస్ట్రేషన్ పత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. గ్రంథాలయ, సమాచార శాస్త్రంలో పరిశోధన మార్గదర్శిగా, గ్రంథాలయ పరిపాలనలో చురుకైన పాత్ర పోషిస్తున్నందుకు ఈ గౌరవం లభించింది. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో ఆయన సమర్పించిన పరిశోధనా పత్రాలు ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా నాయక్‌కు బుధవారం ప్రిన్సిపాల్ మోహన్‌రావు, విశ్వవిద్యాలయాల గ్రంథాలయ శాస్త్ర విభాగ అధ్యాపకులు, లైబ్రేరియన్లు, పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు.


దొరస్వామి నాయక్‌కు అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ మోహనరావు

## ధర్మవరంలో చోరీ

ప్రత్తిపాడు: ధర్మవరం గ్రామంలోని ఇక ఇంటిలో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు లేని సమయంలో తాళం బద్దలుగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరానికి చెందిన పలివెల లక్ష్మీనారాయణ దసరా సందర్భంగా కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూడగా 118 గ్రాముల బంగారు వస్తువులు, 70 గ్రాముల వెండి సామగ్రితో పాటు రూ.1.60 లక్షలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.